



ఘట్‌కేసర్: శివారెడ్డిగూడలోని సాయిబాబా ఆలయంలో భక్తుల సందడి

ఘనంగా గురు పూర్ణిమ

గురు పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం వికారాబాద్, మేడ్చల్ జిల్లాలో సాయిబాబా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహా మంగళ హారతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూలై 10



తాండూరు: సాయిబాబాకు పుష్పాభిషేకం చేస్తున్న భక్తులు



శాకంబరీగా రాజరాజేశ్వరి అమ్మవారు

ఘట్‌కేసర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అషాఢ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారి ఆలయల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గురువారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని శివారెడ్డిగూడలోని శ్రీ దండ్లగడ్డ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో కొలువుదీరిన రాజరాజేశ్వరి అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరీగా అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శాకంబరీగా అలంకరించి పూజిస్తే వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని రైతుల విశ్వాసం.

రేషన్ బియ్యం పక్కదారి

జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్‌కు షోకాజ్ నోటీసు

మేడ్చల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రేషన్ బియ్యం పక్కదారి పట్టడంపై జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ సుగుణాబాయికి ఆ శాఖ కమిషనరు షోకాజ్ నోటీసు జారీ చేశారు. మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీలో కాప్రా, రామంతాపూర్ ఎమ్ఎల్ఎస్ పాయింట్లతోపాటు జిల్లాలో పలు ఎమ్ఎల్ఎస్ పాయింట్లలో అవకతవకలు జరిగినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఇప్పటికే ఈ విషయంలో ఇద్దరు ఎమ్ఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలతోపాటు ఇద్దరు డీటీఓలు, ఒక టెక్నికల్ అసిస్టెంట్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. దీనిపై అదనపు కలెక్టర్‌ను విచారణాధికారిగా వేశారు. తాజాగా జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. బియ్యం పంపిణీలో సరిగా సూపర్‌వైజింగ్ చేయనందునే బియ్యం పక్కదారి పట్టిందని, దీనిపై సంజాయిషీ ఇవ్వాలని షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిసింది.

జిల్లాలో కొత్తగా 24 ప్రాథమిక పాఠశాలలు

మేడ్చల్, జూలై 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో నూతనంగా 24 ప్రాథమిక పాఠశాలలు మంజూరైనట్లు జిల్లా విద్యాధికారి విజయకుమారి తెలిపారు. 20 మంది విద్యార్థులు ఉన్నచోట పాఠశాలను ఏర్పాటు చేయాలని ఇటీవల ప్రభుత్వం జీవో జారీ చేసిన విషయం తెలిసిందే. జిల్లాలో నూతనంగా 24 ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయనున్నామని, వీటి కోసం భవనాలు సిద్ధంగా లేవని పేర్కొన్నారు. కమ్యూనిటీ హాల్స్, ప్రభుత్వ భవనాలు, ఇతర శాఖలకు చెందిన భవనాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. అద్దె భవనాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి విధివిధానాలు రాలేదని, ప్రస్తుతం ప్రభుత్వ భవనాల కోసం చూస్తున్నట్లు డీఈఓ తెలిపారు. ఈ నెలాఖరులోగా జిల్లాలో నూతన పాఠశాలలను ప్రారంభించేలా చర్యలు చేపట్టామని వెల్లడించారు.

రుణ గోస!

రైతుకు దక్కని 'కిసాన్ క్రెడిట్'

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ) రైతులందరికీ అందక అవస్థలు పడుతున్నారు. ఏటా ప్రభుత్వాల అందజేసే ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. కేంద్రం కిసాన్ క్రెడిట్ కార్డులు ఉన్నవారికి రూ.5లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తుంది. కోళ్లు, గొర్రెలు, పశువులు, మత్స్య పరిశ్రమలకు చెందిన రైతులకు కూడా ఈ కార్డు ద్వారా లోన్లు ఇస్తున్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు పొందేందుకు అవకాశం ఉంది. అయితే ఉమ్మడి జిల్లాలో దాదాపు 10 లక్షల మంది రైతులు ఉండగా, ఇప్పటివరకు 50 శాతం మందికి కూడా కిసాన్ క్రెడిట్ కార్డులు జారీ కాలేదు. కార్డుల జారీలో బ్యాంకర్లు, అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తూ ఆశించిన మేర కార్డులు జారీ చేయకపోవడంతో చాలామంది రైతులకు లబ్ధి చేకూరడం లేదు.



ఉమ్మడి జిల్లాలో 50 శాతం దాటని కిసాన్ క్రెడిట్ కార్డుల జారీ

- ఏటా లక్షలాది మంది రైతులకు అందని ప్రయోజనాలు
- రుణాలు ఇవ్వడానికి చుక్కలు చూపుతున్న బ్యాంకర్లు
- సిబిల్ స్కోర్ సాకు చూపి లోన్లు ఇవ్వని వైనం
- ఉమ్మడి జిల్లాలో సుమారు 10లక్షల మంది రైతులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

రైతులకు ప్రయోజనం కలిగించే కిసాన్ క్రెడిట్ కార్డుల జారీపై అధికారులు, బ్యాంకర్లు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా వడ్డీలేని రుణాలు, తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్న విషయం తెలిసిందే. వ్యవసాయ, అనుబంధ రంగాలను ప్రోత్సహించేందుకు 1998లో కేంద్రం అమల్లోకి తెచ్చిన కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ) ఇప్పటికీ రైతులందరికీ చేరలేదు. దీంతో ప్రతిఏటా లక్షలాది మంది రైతులకు ప్రభుత్వం ద్వారా అందే ప్రయోజనాలు దక్కడం లేదు. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా ఇచ్చే రుణపరిమితిని ఇటీవల కేంద్రం రూ.3 లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. ఇందులో రూ.లక్ష వరకు ఇచ్చే రుణాలకు సున్నా వడ్డీ అమలు చేస్తున్నారు. సకాలంలో తీసుకున్న రుణాలను చెల్లించిన వారికి

మిగతా 7వ పేజీలో...



కార్డు ప్రయోజనాలు ఇవే...

సాధారణంగా రైతులకు ఇచ్చే రుణాలను బ్యాంకులు రైతు పొదుపు ఖాతాలో జమచేస్తాయి. రైతు తిరిగి రుణాలు చెల్లించే సమయంలో బ్యాంకు అధికారులు అప్పటి వరకు వడ్డీ లెక్కించి ఈ మొత్తాన్ని రైతుల నుంచి వసూలు చేస్తాయి. అయితే కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా ఇచ్చే రుణాలను నేరుగా కేసీసీ ఖాతాకు బదిలీ చేస్తారు. ఇప్పటికే రైతుకు ఏదైనా బ్యాంకు నుంచి డెబిట్ కార్డు ఉంటే దీన్ని కేసీసీ కార్డుతో అనుసంధానం చేస్తారు. దీంతో ఎప్పుడు కావాలంటే అప్పుడు రైతులు ఈ కార్డు ద్వారా నగదు డ్రా చేయవచ్చు. డ్రా చేసే సమయంలో పొదుపు ఖాతా, కేసీసీ ఖాతాలు వేర్వేరుగా చూపిస్తాయి. ఏది కావాలంటే అది ఎంచుకుని నగదు డ్రా చేసుకోవచ్చు. బ్యాంకు నుంచి పొందే రుణం కిసాన్ క్రెడిట్ కార్డు ఖాతాకు బదిలీ అయిన తరువాత రైతు తనకు కావాల్సిన సమయంలో కావాల్సిన మొత్తాన్ని డ్రా చేసుకోవచ్చు. కేసీసీలోని నగదును రైతు ఎంత వినియోగించుకుంటే అంతవరకు మాత్రమే వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఇది రైతులకు ఎంతో ప్రయోజనం. అలాగే కిసాన్ క్రెడిట్ ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసే రైతులకు రాయితీ అందుతుంది. అయితే రాయితీ పొందాలంటే పీఓఎస్ యంత్రాలు ఉన్నచోట మాత్రమే వీటిని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇది కాకుండా కిసాన్ క్రెడిట్ కార్డులు ఉన్నవారికి రూపే కార్డులు కూడా ఇస్తారు. ఈ కార్డు ద్వారా పావలా వడ్డీకే అదనంగా లక్ష వరకు రుణం పొందవచ్చు. అలాగే ఈ కార్డులు ఉన్న రైతులకు సురక్ష బీమా యోజన పథకం వర్తిస్తుంది.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

నాణ్యమైన విద్యను అందించాలి

» కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం వికారాబాద్ మండలం గొట్టిముక్కుల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు, పౌష్టికాహారంపై ఆరా తీశారు. జిల్లా పరిషత్ హై స్కూల్‌లో తరగతి గదులను పరిశీలించి పదో తరగతి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. ఇంగ్లిష్‌లో ఓ పాఠం బోధించి ఆశ్చర్యపరిచారు. విద్యార్థులతో కొన్ని పోయెమ్స్ చదివించారు. ఐపీఎఫ్(ఇంట్రాక్ట్ ఫ్లాట్ పానెల్) ద్వారా జరుగుతున్న బోధన విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల గదులు, మరుగుదొడ్లు, వంట గది, కొత్తగా నిర్మించిన డైనింగ్ హాల్ తదితర మౌలిక సదుపాయాలు, స్టాక్ రిజిస్టర్లు, వంట సరుకులను పరిశీలించారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి, ఎంఈవో బాబు సింగ్, ప్రధానోపాధ్యాయుడు శివకుమార్, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి ఉన్నారు.



మధ్యాహ్నం ఆరుబయటే..

బషీరాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు)విద్యార్థులు భోజనశాల లేక పాఠశాల ఆవరణలో చెట్ల కింద, ఎక్కడబడితే అక్కడ కూర్చొని భోజనం చేస్తున్నారు. అసలే వానకాలం.. విష పురుగులు తిరుగుతుంటాయి. ఇలాంటి సీజన్‌లో విద్యార్థులకు భోజనశాల ఎంతో అవసరం. గత ప్రభుత్వ హయాంలో భోజనశాల నిర్మాణం చేపట్టిన అసంపూర్తిగా వదిలేయడంతో నిరుపయోగంగా మారింది. ఈ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే, భోజనశాలకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

దగాఖానాలు!

నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రుల నిర్వహణ

- శస్త్ర చికిత్సలతో ప్రాణాలు హరీ
- నార్మల్ డెలివరీకి అవకాశం ఉన్నా సిజేరియన్లు
- పరీక్షలు, మందుల పేరుతో అదనంగా దోపిడీ

పరిగి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వైద్యం ముసుగులో కొన్ని ప్రైవేటు దవాఖానాలు, క్లినిక్‌లు దగా చేస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా దోపిడీకి పాల్పడుతున్నాయి. ఎలాంటి అర్హత లేకున్నా పుట్టగొడుగుల్లా ఆస్పత్రులు వెలుస్తున్నాయి. వచ్చిరాని వైద్యంతో శస్త్ర చికిత్స చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు చేస్తున్నాయి పరిగి పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులు. తాజాగా విజేత ఆస్పత్రిలో ఓ గర్భిణికి అబార్షన్ చేసి ఇద్దరు కవల పిల్లలను తొలగించిన ఉదంతం అందరినీ కలచివేసింది. గతంలోనూ ఈ ఆస్పత్రిలో అనేక ఘటనలు జరిగాయి. విజేత, బాలాజీ, సాధన, యాసీన్ ఇలా అనేక ఆస్పత్రుల్లో వైద్యం వికటించి మృతి చెందిన ఘటనలు జరిగాయి. ఇంకా ఆర్ఎంపీలు వచ్చిరాని వైద్యంతో పేదల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. వైద్యాధికారులు ఏం పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో ప్రైవేట్ క్లినిక్‌లది ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది.

పరిగిలో ఎలాంటి అర్హతలు, అనుమతులు లేకుండా నర్సింగ్‌హోంలు నిర్వహిస్తున్నారు. వచ్చిరాని వైద్యంతో

మిగతా 8వ పేజీలో...



పరిగిలోని విజేత ఆస్పత్రి ఎదుట నిరసన(ఫైల్)

రికార్డులు స్వాధీనం: డీఎంహెచ్‌వో

పరిగిలోని విజేత ఆస్పత్రిలో జరిగిన అబార్షన్ ఘటనపై కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం డీఎంహెచ్‌వో లలితా దేవి విచారణ చేపట్టారు. ఆస్పత్రిలో అబార్షన్లకు సంబంధించి రిపోర్టులు, రికార్డులు స్వాధీనం చేసుకున్నామని, పూర్తిస్థాయి విచారణ తర్వాత చర్యలు తీసుకుంటామని తెలిపారు. అబార్షన్‌పై గర్భిణీ అత్తమామల అనుమతి తీసుకోవాల్సి ఉండేదని, పరిస్థితి తీవ్రంగా ఉంటే ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేయాల్సింది పోయి ఎందుకు అబార్షన్ చేశారని వైద్యురాలిని ప్రశ్నించారు. గర్భిణీ, ఆమె కుటుంబ సభ్యులను పోలీసుల సమక్షంలో విచారించారు. ఈ విచారణలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు రవీంద్రయాదవ్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు ఉన్నారు.



అనంతగిరిలో పెరుగు బసంతం వేడుకలు



వైభవం.. పెరుగు బసంతం

వికారాబాద్/మర్పల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి అనంతపద్మనాభ స్వామి ఆలయంలో ఆషాఢ మాస ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. గురువారం పెరుగు బసంతం వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని పల్లకీపై ఊరేగించి దైవ ప్రసాదం తీసుకొచ్చి పెరుగు బసంతం నిర్వహించారు. ఈ వేడకను చూసేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చి దైవ ప్రసాదం కోసం పోటీ పడ్డారు. దైవ ప్రసాదాన్ని పొలాల్లో చల్లుకోవడం ఆనవాయితి. ఈ వేడుకల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్పీకర్‌కు పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్పీకర్ స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి పెరుగు బసంతం వేడుకల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు చిగుళ్లపల్లి రమేష్, కిషన్ నాయక్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. అనంతరం స్పీకర్ మర్పల్లి మండల కేంద్రంలోని సయ్యద్ పటేల్ దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, నాయకులు రాములుయాదవ్, సురేశ్, రాచన్న, సర్వేశ్, మల్లేశ్ ఉన్నారు.



స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ఓగీపూర్ నాపరాతి గనుల్లో తనిఖీలు

తాండూరు రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓగీపూర్ శివారులోని నాపరాతి గనుల్లో తాండూరు మైన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ, ఆర్ఐ నిర్మల, టెక్నికల్ అసిస్టెంట్ నాగలక్ష్మి, నారాయణ గనుల్లోకి వెళ్లి పరిశీలించారు. బుధవారం సర్వే నంబర్-56లో 39 గుంటల భూ వివాదంపై రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ రూరల్ బృందం సభ్యులు జావెద్‌కు చెందిన సంబంధిత భూమిలో సర్వే నిర్వహించారు. ఆ నివేదికపై తాండూరు మైన్స్ అధికారులు మరోమారు పరిశీలించారు.



గనుల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

వైద్య బోధన, సౌకర్యాలపై సమీక్ష

తాండూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్రకుమార్ గురువారం ఆస్పత్రి సిబ్బంది, మెడికల్ కళాశాల ప్రతినిధులతో సమీక్షించారు. గతంలో నేషనల్ కౌన్సిల్ కొడంగల్ మెడికల్ కళాశాల, తాండూరు ఆస్పత్రిని సందర్శించింది. వారు చేసిన సూచనలను ఏ విధంగా అమలు చేస్తున్నారు, కొత్తగా వస్తున్న మెడికల్ బ్యాచ్‌కు బోధన, సౌకర్యాలు, మార్పులపై చర్చించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్లాసులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కొడంగల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు, సూపరింటెండెంట్లు డాక్టర్ మాలతి, డాక్టర్ వినయ్, మాతా శిశు ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సునిత, తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు చెక్‌డ్యామ్!

మూడు కిలోమీటర్ల మేర నిలిచిన 'కాగ్నా' నీరు

6



ఎఫ్‌టీఎల్ నిర్మాణాలపై నోటీసులు

ఘట్‌కేసర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని చెటేరుకుంటను ఆక్రమించి ప్రహరీ నిర్మించిన 'ధరణి ప్రైమ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్' సంస్థ నిర్వాహకుడికి రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. చెటేరుకుంటలోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను ఆక్రమించి గోడ నిర్మించిన విషయమై ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్త విచారణ జరిపి చెరువు స్థలంలో నిర్మాణాలు చేసిన డెవలపర్స్ సంస్థ నిర్వాహకుడు గుర్రం సదానందనరెడ్డికి వాల్టా కింద ఇరిగేషన్ అధికారులు నోటీసులు ఇచ్చారు. వెంటనే చెటేరు కుంటలోని ఎఫ్‌టీఎల్, బఫర్ స్థలంలో నిర్మించిన నిర్మాణాన్ని తొలగించాలని నోటీసులో ఆదేశించారు. లేకుంటే వారం రోజుల్లో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ నోటీసులో పేర్కొన్నారు.

రాకపోకలకు చెక్ డ్యామ్!

- 3 కిలోమీటర్ల మేర నిలిచిన 'కాగ్నా' నీరు
- వంతెన నిర్మాణానికి ఆటంకం
- ఇబ్బందులు పడుతున్న గ్రామాల ప్రజలు


తాండూరు మండలం బొంకూర్ గ్రామానికి వేళ్లే దారిలో పారుతున్న కాగ్నా నది

తాండూరు రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): నీటి నిల్వ కోసం నిర్మించిన చెక్ డ్యామ్‌తో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వానాకాలంలో వచ్చే వరదతో నీరు నిలిచి రవాణా సౌకర్యం లేక బిజ్వార్ పంచాయతీ అనుబంధ గ్రామం బోంకూర్‌కు వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నదిని దాటుకుంటూ గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి. ఖాంజాపూర్ శివారు కాగ్నా నది వద్ద నీటి నిల్వ కోసం నీటి పారుదల శాఖ అధికారులు చెక్ డ్యాం నిర్మించారు. దీంతో మూడు కిలో మీటర్ల వరకు నీరు నిలిచి బొంకూరు-బిజ్వార్‌ల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పరిస్థితుల్లో నదిలో నుంచి దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వంతెన నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో!

ఈ ప్రదేశంలో బ్రిడ్జి కోసం గ్రామస్తులు అప్పటి మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి విన్నవించారు. మంత్రి ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్ అధికారులు 80 మీటర్ల దూరానికి రూ.కోటితో ప్రతిపాదనలు పంపించారు. అప్పటి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, అప్పటి సర్పంచ్ నరేందర్‌రెడ్డి కృషితో బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.85కోట్లు నిధులు మంజూరయ్యాయి. 10 అక్టోబర్ 2023లో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటికే ఎన్నికల కోడ్ రావడం, ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారడంతో వంతెన నిర్మాణం శిలాఫలకానికే పరిమితమైంది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. నదిలో పిల్లర్లు వేసేందుకు ప్రయత్నించగా నీరు నిలిచి పనులు చేయలేదు. ఖాంజాపూర్ శివారు కాగ్నాపై చెక్ డ్యాం నిర్మాణంతో మూడు కిలో మీటర్ల మేర నీరు నిలిచిపోయింది. బొంకూరు-బిజ్వార్‌ల మధ్య కాగ్నా నిండు కుండను తలపిస్తోంది. దీంతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తాండూరులోని పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రుక్మాపూర్ నుంచి తాండూరుకు వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాని కోరుతున్నారు.

గ్రామాల్లో 100 మంది అభిప్రాయాలు సేకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025లో భాగంగా ప్రతి గ్రామంలో వందమంది పౌరులు యాప్‌లో అభిప్రాయం(ఫీడ్‌బ్యాక్) ఇవ్వాలన్న దిశగా పంచాయతీ కార్యదర్శులు పనిచేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయం నుంచి ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీలో కనీసం ఒక సామాజిక ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 19కొత్త పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్ నిర్మాణానికి స్థలాన్ని గుర్తించాలని ఆదేశించారు. వన మహోత్సవంలోప్రతి ఇంటికి ఆరు మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులంతా తప్పనిసరిగా నిర్మాణం చేపట్టేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, ఐపీఆర్ అధికారి ఉమేష్, డీఈలు, ఏఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలు పరిశీలించాలి

బూత్ లెవెల్ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను నిశితంగా పరిశీలించాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. గురువారం మునిసిపల్ కార్యాలయంలో రెండో రోజు బూత్ లెవల్ అధికారుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన హాజరైన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫారమ్ 6, 7, 8 నిర్వహణలో శ్రద్ధ వహించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఓటర్ల జాబితాలో పాత ఫొటోలను తొలగించి, తాజా ఫొటోలను అప్‌లోడ్ చే యాలన్నారు. పేర్లలో తప్పులు ఉంటే సరిచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫారమ్ 6 ద్వారా కొత్త ఓటర్లను నమోదు చేయాలని, కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని సూచించారు. మరణించిన వారి పేర్లను తొలగించేందుకు ఫారమ్ 7ను ఉపయోగించాలని, వారి మరణ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా పొందాలని తెలిపారు. పేరు మార్పులు, ఇతర సవరణల కోసం ఫారమ్ 8 వినియోగించాలని సూచించారు. ఈ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, అధికారులు, బీఎల్వోలు మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

భ్రూణ హత్యకు పాల్పడిన ఆస్పత్రి గుర్తింపును రద్దు చేయాలి


మాట్లాడుతున్న వివిధ సంఘాల నాయకులు

పరిగి,జూలై 10(ఆంధ్రజ్యోతి): భ్రూణ హత్యకు పాల్పడిన విజేత ఆస్పత్రి గుర్తింపును రద్దు చేసి, క్రిమినల్ కేసులు పెట్టాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్,ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం విజేత ఆస్పత్రిలో గర్భిణికి అబార్షన్ చేసి ఇద్దరు కవల పిల్లలను హత్య చేశారని అన్నారు. భ్రూణ హత్య, లింగ నిర్ధారణ చట్టం ప్రకారం అధికారులు సూమోటాగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆస్పత్రిని సీజ్ చేసి క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. మొదటి నెల నుంచి తొమ్మిదో నెల వరకు తమ వద్దే పరీక్షలు చేయించుకుంటే సాధారణ కాన్పు చేస్తామని పేద గర్భిణులకు ఆశపెట్టి చివరికి ఏవో సాకులు చెప్పి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. నార్మల్ డెలివరీ పరిస్థితులు ఉన్నా సిజేరియన్లు చేస్తున్నారన్నారు. ఇలాంటి ఆస్పత్రులపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. వివిధ సంఘాల నాయకులు హబీబ్, సత్తయ్య తదితరులు ఉన్నారు.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

వికారాబాద్,జూలై10(ఆంధ్రజ్యోతి): 2015లో పరిగి పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసులో వికారాబాద్ జిల్లా జడ్జి సున్నం శ్రీనివాస్ రెడ్డి ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి 3వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి గురువారం తెలిపారు. ఈ కేసులో ఫిర్యాది దారు గొల్ల బిచ్చన్న బావ పరిగి మండలం బొంపల్లి వాసి ముద్దం శ్రీనివాస్‌ను భూమి గొడవల్లో 17-7-2015న అతడి పాలివారు చంపారన్నారు. నారాయణపూర్‌లో గల తన పొలంలో శ్రీనివాస్ ఉండగా గోపాలకృష్ణయ్య అలియాస్ కృష్ణయ్య, నిడూరం అంజిలయ్య, నిడూరం నరసమ్మలు గొడవపడి శ్రీనివాస్, అతడి తండ్రిని కట్టెలు, కర్రుతో కొట్టారన్నారు. దీంతో ముద్దం శ్రీనివాస్ అక్కడికక్కడే చనిపోయాడని ఎస్పీ చెప్పారు. అప్పటి పరిగి ఎస్ఐ నాగేష్ కేసు నమోదు చేయగా, రెండో దర్యాప్తు అధికారిగా అప్పటి సీఐ ప్రసాద్ వ్యవహరించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారన్నారు. డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీనివాస్‌రెడ్డి కేసు విచారణ చేసి నిందితులకు శిక్ష ఖరారు చేశారన్నారు. ఈ కేసులో పనిచేసిన పీపీ సుధాకర్‌రెడ్డి, అప్పటి పోలీసు అధికారు లు, బ్రీఫింగ్ అధికారి ఎన్.శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ సంతోష్‌కుమార్, కోర్టు డ్యూటీ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, లైజన్ ఆఫీసర్ బి.వీరన్నలను ఎస్పీ అభినందించారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి


యాచారంలో జెండాను ఆవిష్కరించిన బ్రహ్మయ్య

యాచారం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య కోరారు. గురువారం యాచారంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. 2019 ట్రాన్స్‌పోర్ట్ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటీయు నాయకులు శంకర్, జంగయ్య, శ్రీరాములు, శ్రీ శైలం, మల్లేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల రాక కోసం..

- ఉపాధ్యాయుడి ఎదురు చూపు
- పది రోజులుగా స్టూడెంట్స్ నిల్!


పాఠశాలలో ఒంటరిగా కూర్చున్న ఉపాధ్యాయుడు నవీన్‌కుమార్

కులకచర్ల, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుసుమ సముద్రం పంచాయతీ పరిధి అలుగుగడ్డ తండా పాఠశాలలో ఉపాధ్యాయుడు నవీన్‌కుమార్ 10 రోజులుగా విద్యార్థుల రాక కోసం ఎదురుచూస్తున్నారు. గత సంవత్సరం విద్యార్థులు లేరని పాఠశాలను ప్రభుత్వం మూసేసింది. తండాల్లో అన్ని పాఠశాలలను తెరవాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఈ సారి రీఓపెన్ చేశారు. ఇద్దరు విద్యార్థులు అడ్మిషనై పది రోజులు వచ్చారు. జూన్ చివరిలో వారి కుటుంబీకులు ఉపాధి కోసం పుణెకు వెళ్లగా విద్యార్థులూ వారితో పాటు వెళ్లారు. దీంతో అన్నటి నుంచి ఒక్క విద్యార్థి కూడా లేకుండా పోయారు. ఈ విషయంపై ఎంఈవో హబీబ్ అహ్మద్ స్పందన కోరగా.. "పాఠశాలలకు విద్యార్థులొచ్చేలా ఉపాధ్యాయుడిని ప్రయత్నం చేయమన్నాం. మరికొన్ని రోజుల్లో పిల్లలు రాకుంటే ఆ టీచర్‌ను మరో పాఠశాలకు డిప్యూట్ చేస్తాం." అని వివరించారు.

బీఆర్‌ఎస్ చేసిన ద్రోహాన్ని గుర్తించాలి



కందుకూరు,జులై10(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన ద్రోహాన్ని ప్రజలు గమనించాలని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పోరాటాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కృష్ణా జలాల్లో 36 శాతం చాలని, ఆంధ్రప్రదేశ్ 64శాతం నీటిని తీసుకోవచ్చని కేసీఆర్ ఒప్పందం చేసుకున్న విషయాన్ని విస్మరించి నేడు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

విద్యార్థుల కోసం ఉచిత బస్సులు నడపాలి


వినతి పత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

కేశంపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా బస్సులు ఏర్పాటు చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మసమాజ్ పార్టీ నాయకులు గురువారం తహసీల్దార్ ఆజం అలీకి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో 26వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలు ఉన్నాయని, వాటిల్లో 22లక్షల మంది విద్యార్థులు చదువుతున్నా తెలిపారు. విద్యార్థులు వేరే గ్రామాల నుంచి వస్తారని తెలిపారు. ప్రతి 30మంది విద్యార్థులకు ఒక బస్సును ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రమేష్‌గౌడ్, పాండు, డీఎస్పీ నాయకులు రమేష్, మహిపాల్, రవి, మల్లేష్, అంజి, కృష్ణ, విష్ణు, పురుషోత్తం, నరేష్, గణేష్ పాల్గొన్నారు.

ఫార్మాసిటీ భూముల్లో పంటల సాగు


ఫార్మాసిటీ భూమిలో వరి నారు

యాచారం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలో మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, పల్లెచెల్క తండా, మంగలిగడ్డ తండా, గొల్లగూడ, కుర్మిద్ద తండాల్లో ఫార్మాసిటీ భూముల్లో రైతులు పంటలు సాగుచేస్తున్నారు. పత్తి, జొన్న, కంది పంటలు వేశారు. ప్రస్తుతం పత్తి చేలల్లో కలుపుతీ పనుల్లో నిమగ్నమయ్యారు. బోర్ల కింద వరి నారు నాటుకొచ్చింది. ఫార్మా భూముల్లో పంటలు వేయకుండా చూడాలని రెండు నెలల క్రితమే కలెక్టర్ నారాయణరెడ్డి రెవెన్యూ, సంబంధిత అధికారులను ఆదేశించారు. పంటల సాగుకు తమకెవరూ అభ్యంతరం చెప్పలేని రైతులు తెలిపారు. బోర్లు నీరు పోస్తుండడంతో వరి నారు పోసుకున్నామని చెబుతున్నారు.

ఎమ్మెల్సీని కలిసిన జేఏసీ చైర్మన్


కోదండరామ్, నారాయణరెడ్డిలతో సదానందంగౌడ్

ఆమనగల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కోదండరామ్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలను గురువారం జేఏసీ చైర్మన్ సదానందంగౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. సదానందంగౌడ్, నాయకులు హైదరాబాద్‌లో వారిని కలిసి సత్కరించారు. కల్వకుర్తి అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దినకరన్ తదితరులు ఉన్నారు.

ఓటర్ల జాబితా పకడ్బందీగా ఉండాలి

ఆమనగల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాను బూత్ లెవల్ అధికారులు పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీవో శ్రీను సూచించారు. గురువారం ఆమనగల్లు రైతు వేదికలో తహసీల్దార్ లలిత ఆధ్వర్యంలో బీఎల్వోలకు శిక్షణ నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ.. కొత్త ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు పక్కాగా చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో డీటీ లు వినోద్‌కుమార్, రాఘవేందర్, మాస్టర్లు ట్రైనర్లు, బీఎల్వో లు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు అండగా ఉంటాం

మొయినాబాద్ రూరల్, జూలై 10(ఆంధ్యజ్యోతి): ఎన్కేపల్లి భూ నిర్వాసితులకు బీజేపీ అండగా ఉంటుందని, రైతులకు న్యాయంజరిగే వరకు చేసే పోరాటానికి చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అధ్వర్యంలో కార్యాచరణ రూపొస్తామని రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు రాజు భూపాల్‌గౌడ్ అన్నారు. హైదరాబాద్ శివారు ఎన్కేపల్లిలోని సర్వే నంబర్ 180లోని 99ఎకరాల 14గుంటల ప్రభుత్వ భూమిలో ప్రభుత్వం గోశాల ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ స్థలంలో సాగులో ఉన్న రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాజు భూపాల్‌గౌడ్ వారితో మాట్లాడారు. మండలంలో సాగుకు పనికిరాని ప్రభుత్వ భూములున్నాయని, వాటిని గోశాలకు తీసుకోవాలని, రైతుల భూమి లాక్కోవడం సరి కాదన్నారు. బలవంతంగా తీసుకున్నా మరో చోట సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గోశాలకు బీజేపీ వ్యతిరేకం కాదని, పేదల భూమిని లాక్కోవడం పైనే ఉద్యమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు అంజన్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే రత్నం, కంజర్ల ప్రకాశ్, ఓబీసీ జిల్లా కన్వీనర్ వెంకటేష్‌గౌడ్, కిషన్, రైతులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, కమిషనర్ సుధీర్‌బాబు

భూమి కోల్పోయిన వారికి ప్లాట్ల కేటాయింపు

కందుకూరు, జులై 10(ఆంధ్రజ్యోతి): కందుకూరు, యాచారం మండలాల్లో ఫార్మాసిటీ నిర్వాసిత రైతులకు ప్రభుత్వం ఇంటి స్థలాన్ని కేటాయించింది. గురువారం మీర్ఖాన్‌పేట, పంజగూడ, తిమ్మాయిపల్లిల్లో హెచ్ఎండీఏ లే అవుట్‌లోని ఏటీసీ కేంద్రంలో లాటరీ నిర్వహించారు. ఇప్పటి వరకు రెండున్నర ఎకరాల వరకు భూమి కోల్పోయిన రైతులకు విస్తీర్ణాన్ని బట్టి 60, 121, 242, 302 గజాల చొప్పున ప్లాట్లను 2,382 మందికి కేటాయించారు. లాటరీలో నిర్వహణను జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేష్‌మోహన్ పరిశీలించారు. టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, కందుకూరు, ఇబ్రహీంపట్నం ఆర్డీవోలు జగదీశ్వర్‌రెడ్డి, అనంతరెడ్డి ఏర్పాట్లను చేశారు. శుక్రవారం 363, 423, 484, 544 గజాల ప్లాట్లకు లాటరీ తీసి నిర్వాసితులకు కేటాయిస్తామని ఆర్డీవోలు తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, తహసీల్దార్లు కె.గోపాల్, అయ్యప్ప, కందుకూరు, యాచారం డీటీలు, ఆర్ఐలు, మహేశ్వరం సబ్‌సబ్‌రిజిస్ట్రార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీ వేదికపై ఉట్టిపడిన తెలంగాణ సంస్కృతి

పూడూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ ట్రైనింగ్(సీసీఆర్టీ) నిర్వహిస్తున్న 'రోల్ ఆఫ్ పప్పెట్రీ ఇన్ ఎడ్యుకేషన్ ఇన్ లైన్‌విత్ నెప్(ఎన్ఈపీ)' వేదికపై తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడింది. ఇక్కడ వివిధ రాష్ట్రాల ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం తెలంగాణ తరఫున రాష్ట్ర పండుగలు, రాష్ట్ర చిహ్నాలు, పుణ్యక్షేత్రాలు, సాహిత్యం, కవులు, ప్రసిద్ధ వ్యక్తులు, రాష్ట్ర గొప్పతనాన్ని చాటేలా ఉపాధ్యాయులు ప్రదర్శనిచ్చారు. ప్రదర్శన కార్యక్రమంలో టీచర్లు రాజేష్‌కుమార్, స్వప్న(ములుగు జిల్లా), రమేష్‌విజయ్(జగిత్యాల), దిలీప్(మంచిర్యాల), ప్రవీణ్ (నిర్మల్), రమేష్(యాదాద్రి), ఈశ్వర్‌రావు(వికారాబాద్), కవిత(మెదక్), సఫియా సుల్తానా(సంగారెడ్డి) పాల్గొన్నారు.

బిల్లులివ్వాలని కార్యాలయానికి తాళం

ఇబ్రహీంపట్నం, జూలై 10(ఆంధ్రజ్యోతి): పది నెలలుగా కోడిగుడ్ల బిల్లులు ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన మధ్యాహ్న భోజన కార్మికులు గురువారం ఇబ్రహీంపట్నం ఎంఈవో కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. బిల్లుల విషయమై కలెక్టర్‌కు నివేదించామని, త్వరలోనే బిల్లులొస్తాయని కార్యాలయ సిబ్బంది నచ్చజెప్పడంతో మహిళలు ఆందోళన విరమించారు. పది నెలలుగా అప్పుచేసి మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు గుడ్లు వడ్డిస్తున్నామన్నారు. బిల్లుల కోసం ఎన్నోసార్లు అధికారులకు విన్నవించామన్నారు. ఇప్పటికైనా వెంటనే బిల్లులు అందజేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న, ఎల్లేష్, వివిధ సంఘాల నాయకులు తరంగ్, జగదీశ్ పాల్గొన్నారు.


ఎంఈవో కార్యాలయానికి తాళంవేసి ఆందోళన చేస్తున్న భోజన కార్మికులు



'కాగ్నా'కు గంగా హారతి

తాండూరు ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో యాలాల మండలం కోకట్ సమీపంలోని వంతెన పక్కన గురువారం కాగ్నా నదిలో పౌర్ణమి హారతి నిర్వహించారు. ప్రతి పౌర్ణమికి నిర్వహించే గంగా హారతిలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పురోహితుల సంఘం ఆధ్వర్యంలో దీపోత్సవాన్ని నిర్వహించారు.

తాండూరు, జులై 10(ఆంధ్రజ్యోతి)

ఘనంగా జాతీయ మత్స్యకారుల దినోత్సవం

రంగారెడ్డి అర్బన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో గురువారం జాతీయ మత్స్య రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సంఘం విధివిధానాలతో పాటు చేపల పెంపకం, పెట్టుబడి, మార్కెటింగ్ తదితర అంశాలపై చర్చించుకున్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమ, మత్స్యసంఘం నాయకులు గోరికల నర్సింహ్మా, దూస వెంకటేశం, సతీష్, నీటరి అశోక్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



స్వదేశానికి ఉమ్రా యాత్రికులు

15 రోజుల క్రితం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి మక్కా,మదీనా దర్శనానికి వెళ్లిన యాత్రికులు గురువారం స్వదేశం చేరుకున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 50 మంది ఉమ్రా యాత్రకు వెళ్లారని అల్ మీజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఎండీ ఫయాజ్‌అలీ తెలిపారు.

శంషాబాద్ రూరల్, జులై 10(ఆంధ్రజ్యోతి)

రుణ గోస!

(ఐదో పేజీ తరువాయి)



వడ్డీ రాయితీ లభిస్తోంది. ఇలాంటి రైతులకు కేంద్రం నాలుగు శాతం, రాష్ట్ర ప్రభుత్వం మూడు శాతం వడ్డీ రాయితీ కింద అందచేస్తాయి. దీంతో రూ.లక్షలోపు రుణం తీసుకుని సకాలంలో వీటిని చెల్లించిన రైతులకు సున్నా వడ్డీకే రుణం దక్కుతుంది. అలాగే రూ.లక్ష నుంచి రూ. 5లక్షల లోపు రుణాలకు పావలా వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. కోళ్లు, గొర్రెలు, పశువులు, మత్స్య పరిశ్రమలకు చెందిన రైతులకు కూడా ఈ కార్డు ద్వారా రుణాలు ఇస్తున్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు పొందేందుకు అవకాశం ఉంది. అయితే ఉమ్మడి జిల్లాలో దాదాపు 10లక్షల మంది రైతులు ఉండగా, ఇప్పటివరకు 50శాతం మందికి కూడా కిసాన్ క్రెడిట్ కార్డులు జారీ కాలేదు. ఉమ్మడి జిల్లాలో ఆశించిన మేర కార్డులు జారీ చేయకపోవడంతో రైతులకు లబ్ధి చేకూరడం లేదు. ఈ విషయంలో బ్యాంకర్లు, అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రైతులకు ఇప్పటికీ కిసాన్ క్రెడిట్ కార్డులపై అవగాహన లేదు. వీరికి అవగాహన కల్పించే విషయంలో తగిన చర్యలు తీసుకోవడం లేదు. అలాగే అవగాహన ఉన్న రైతులు కిసాన్ క్రెడిట్ కార్డుకు దరఖాస్తు చేసుకున్నా సకాలంలో వీరికి అందచేయడం లేదు. దీనికి అనేక సాకులు చూపుతున్నారు. రుణాల మంజూరు సమయంలో బ్యాంకర్లు కేసీసీ కార్డుల జారీ కోసం రైతుల నుంచి సంతకాలు తీసుకుంటున్నారు. అయితే తరువాత వీటిని మరిచిపోతున్నారు. రుణాలు ఇచ్చే సమయంలో రైతుల నుంచి సంతకాలు తీసుకున్నా కార్డులు మాత్రం జారీ చేయడం లేదు. అలాగే పీఎం కిసాన్ సమ్మాన్ పథకం కింద రైతులకు ఏటా కేంద్రం రూ.6వేల చొప్పున సహాయం అందిస్తున్న సంగతి తెలిసిందే. మూడు విడతలుగా ఈ మొత్తాన్ని రైతు ఖాతాలో జమ చేస్తున్నారు. ఈ పథకం లబ్ధిదారులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు జారీ చేయాల్సి ఉండగా పూర్తిస్థాయిలో ఇది కూడా అమలు చేయడం లేదు.

సిబిల్ స్కోర్ పేరిట..

కిసాన్ క్రెడిట్ కార్డుదారులకు ఎలాంటి గ్యారెంటీ లేకుండా రైతులకు రుణాలు ఇవ్వాలని కేంద్రం నుంచి ఆదేశాలున్నాయి. అయితే బ్యాంకర్లు ఈ నిబంధనలు పట్టించుకోవడం లేదు. రైతుల నుంచి పూచికత్తు అడుగుతున్నారు. సిబిల్ (క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఇండియా లిమిటెడ్) ఇచ్చే స్కోర్ కూడా పరిశీలించిన తర్వాతనే రుణాలు ఇస్తున్నారు. రుణాల మాఫీపై గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన హామీతో రైతులు రుణాలు సకాలంలో చెల్లించలేదు. దీంతో రైతులపై వడ్డీ భారం పడింది. ఇలాంటి రైతులందరికీ సిబిల్ స్కోర్ తగ్గింది. ఈ కారణంతో ఇపుడు రైతులకు బ్యాంకులు రుణాలు సక్రమంగా ఇవ్వడం లేదు. సిబిల్ స్కోర్ సరిగా లేదని, ఆ బ్యాంకులే తిరిగి రుణాలు ఇచ్చేందుకు ఇబ్బందులు పెడుతున్నాయి. ఇదిలా ఉంటే రైతులకు ఇస్తున్న వడ్డీ రాయితీ కూడా రైతులకు సక్రమంగా అందడం లేదు. కొన్నేళ్లుగా కేంద్రం తన వాటాకింద ఇచ్చే రాయితీ ఇస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం రాయితీ సకాలంలో ఇవ్వకపోవడంతో రైతులపై వడ్డీ భారం పడుతోంది.

వీరంతా అర్హులే

కిసాన్ క్రెడిట్ కార్డు పొందేందుకు 18 ఏళ్ల నుంచి 70ఏళ్లలోపు వయసు గల రైతులందరూ అర్హులే. ఆధార్ కార్డు, పొలం పట్టా పత్రాలు ఉన్న వారంతా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల నుంచి లేదా నేరుగా ఆన్‌లైన్ ద్వారా బ్యాంకు వెబ్‌సైట్‌లో కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే మీ సేవా కేంద్రాల్లో కూడా దరఖాస్తు చేసుకోనే అవకాశం ఉంది. అయితే ఈ దరఖాస్తును బ్యాంకు ధ్రువీకరించాల్సి ఉంటుంది. రైతులకు ఇచ్చే కిసాన్ కార్డు కాలపరిమితి అయిదేళ్లుగా ప్రభుత్వం నిర్ధారించింది. రెండున్నర ఎకరాల లోపు పొలం ఉన్న రైతులకు రూ.2లక్షల వరకు రుణం ఇస్తారు. అలాగే ఆపై ఉన్న వారు రూ. 5లక్షల వరకు రుణం పొందవచ్చు.

సమస్యలను పరిష్కరించి రోడ్డు ప్రమాదాలను నివారించాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మేడ్చల్, జూలై 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రోడ్డు భద్రతకు సంబంధించి చిన్న చిన్న సమస్యలను పరిష్కరిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడొచ్చని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా రోడ్డు భద్రత కమిటీ చైర్‌పర్సన్ రాధికాగుప్తా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో సమస్యాత్మక, మరమ్మతులు అవసరమైన రోడ్లపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌తో ఆమె తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. గత సమావేశంలోని చర్చించుకున్న సమస్యలను ఎంత వరకు పరిష్కరించారు? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? అని సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట ఎలక్ట్రిక్ స్తంభాలను షిఫ్ట్‌చేసి రోడ్లను వెడల్పు చేయాలని, రోడ్ల పక్కన ఉన్న ఆక్రమణలకు వెంటనే తొలగించాలని, అవసరమైన చోట స్ట్రీట్‌లైట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్లపై వర్షపు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువగా ప్యాచ్ వర్క్స్‌పై ఆధారపడకుండా అవసరమైన చోట్ల కొత్త రోడ్లను వేయాలని ఇతెలిపారు. రోడ్ల నిర్వహణకు, మరమ్మతులకు అవసరమైన అనుమతులను సంబంధిత శాఖల నుంచి తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం ఎంత మందికి వచ్చింది? ఇంకా ఎంత మందికి పెండింగ్‌లో ఉందని అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రోడ్డు భద్రతపై మున్సిపల్ అధికారులకు సూచనలు చేశారు. రహదారులపై ప్రమాదాలు తగ్గించేందుకు ట్రాఫిక్ పోలీసులతో సమన్వయ చేసుకుంటూ తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్లను ఆదేశించారు. సమావేశంలో రోడ్లు, భవనాల అధికారి, జిల్లా రవాణాధికారి, ట్రాఫిక్ అదనపు డీసీపీ, ఏసీపీ సైబరాబాద్, కూకట్‌పల్లి, మేడ్చల్, మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

కాలుష్యంతో చేపల మృత్యువాత

షాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): వెల్‌స్పన్ కంపెనీ నుంచి విడుదలవుతున్న రసాయనాలతో కలుషిత నీరు చందన్‌వెల్లిలోని కేశవులకుంటలో చేరుతుండడంతో చేపలు, ఇతర జీవరాసులు చనిపోతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. చేపల మృతితో ఉపాధి కోల్పోతున్నామని, ఫ్యాక్టరీ నీరు కుంటలో కలవకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గురువారం వారు మాట్లాడుతూ.. వెల్‌స్పన్ కంపెనీల నుంచి వస్తున్న కలుషిత నీటితో చేపలు చనిపోతున్నాయని, నీరు దుర్వాసన వస్తోందని, ఆ నీటిని పశువులు తాగడం లేదన్నారు. తాగిన పశువులు సైతం అనారోగ్యం పాలవుతున్నాయని, ఇప్పటికే కొన్ని ఎడ్లు, ఆవులు చనిపోయాయని తెలిపారు. చెరువు కింది పొలాల్లో పంటలు సరిగ్గా పండడం లేదని చెప్పారు. ఇంత జరుగుతున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పట్టించుకోవడం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై మూడు సంవత్సరాలుగా అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

కారును ఢీకొన్న లారీ.. ఇద్దరి దుర్మరణం

- కొత్తూర్ వద్ద రోడ్డు ప్రమాదం



పి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.చంద్రశేఖర్‌రెడ్డి(ఫైల్)

కొత్తూర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): కొత్తూరుకు సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద ఓ కారును ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని ఇద్దరు మృతిచెందారు. బుధవారం రాత్రి జరిగిన ఈ దుర్ఘటనపై ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ మండలం దేవునిమామిడిపల్లికి చెందిన ఎర్రగుంట చంద్రశేఖర్‌రెడ్డి(39), మహేశ్వరం మండలం జూండగూడెం(దిలావర్‌గూడ)కు చెందిన మాజీ సర్పంచ్ పరిగి చంద్రశేఖర్‌రెడ్డి(48)లు కారులో జెండాగూడానికి వెళ్తున్నారు. ఎదురుగా వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా, గాయపడ్డ ఎర్రగుంట చంద్రశేఖర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. పరిగి చంద్రశేఖర్‌రెడ్డి సోదరుడు మహేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

274 వ్యవసాయ కనెక్షన్లకు మెటీరియల్ రిలీజ్

- సౌత్ డిస్కం ఆపరేషన్స్ డైరెక్టర్ నర్సిములు


విద్యుత్ అధికారులు, సిబ్బందితో సమీక్షిస్తున్న డిస్కం డైరెక్టర్ నర్సిములు

తాండూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లోని 11కేవీ లైన్లలో ఏర్పడిన ఇబ్బందులను, ఫెయిల్డ్ ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలను ఎప్పటికప్పుడు 'టీజీఎంఎస్ సాసా' యాప్‌లో పొందుపరిస్తే వెంటనే అవసరమైన మెటీరియల్‌ను విడుదల చేస్తామని, అలాగే బడ్జెట్‌ను కేటాయిస్తామని సౌత్ డిస్కం ఆపరేషన్స్ డైరెక్టర్ నర్సిములు అన్నారు. గురువారం తాండూరు విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. డివిజన్‌లో కొత్తగా 274 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు మెటీరియల్‌ను విడుదల చేస్తున్నామని తెలిపారు. ఇంకా 1,050 కనెక్షన్‌లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. విద్యుత్ సరాఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలుచేపట్టాలని, సర్వీస్ మెటీరియల్‌ను అవసరం మేరకు వెంటవెంటనే అందజేస్తామని తెలిపారు. 11కేవీల వద్ద చేసే మరమ్మతుల వివరాలను వెంటనే యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీఈ బాలస్వామి, ఎస్ఈ రవి ప్రసాద్, డీఈ భానుప్రసాద్, ఏడీఈ శంకర్‌నాయక్, ఏఈలు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

వికారాబాద్: నిరంతరాయం నాణ్యమైన విద్యుత్ అందించాలని టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ నర్సింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి అన్నారు. గురువారం వికారాబాద్ ఎస్ఈ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సంస్థ చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ కనెక్షన్లకు అవసరమైన మెటీరియల్‌ను మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఎస్ఈ రవి ప్రసాద్, డివిజన్ ఇంజినీర్లు, అసిస్టెంట్ డివిజన్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

నేడు ఆమనగల్లుకు మంత్రుల రాక

ఆమనగల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు, మాడ్గుల మండలాల్లో రూ. 250 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నట్లు టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు దామోదర రాజనర్సింహ్మా, కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని బీసీ గురుకులాలు, కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిలో అతిథి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా రీజినల్ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మ్యాథమెటిక్స్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జియోలజీ, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల టీచర్ల నియామకానికి ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. మన్నూరాబాద్‌లోని సహారాగేట్ నంబర్ వన్, రోడ్డు నంబర్ 6లోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల పాఠశాల ఎంఆర్ఆర్ కాంప్లెస్‌లో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. ఈ పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని ఆయన పేర్కొన్నారు.

రిటైర్డ్ టీచర్లకు బీజేపీ నాయకుల సన్మానం


రిటైరైన టీచర్లను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

కులకచర్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను కులకచర్లలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ప్రతీ మనిషికి జ్ఞానదాతలు గురువులని, అలాంటి వారిని గౌరవించుకోవడం మన బాధ్యతని బీజేపీ రాష్ట్ర నాయకుడు కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా రిటైర్డ్ టీచర్లు పరంధాములు, మాంతయ్య దాస్, రాంచంద్రయ్యలను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు కాటన్‌పల్లి అంజిలయ్య, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సౌమ్యవెంకట్రామ్‌రెడ్డి, చౌడాపూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు బందెయ్య, సీనియర్ నాయకులు బాలకృష్ణారెడ్డి, హనుమంతు, కె.అంజి, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గురువులను సన్మానించడం మన సంప్రదాయం

మొయినాబాద్ రూరల్, జూలై10(ఆంధ్యజ్యోతి):గురుపౌర్ణమిని పురస్కరించుకొని గురువులను సన్మానించడం హిందూ సంప్రదాయం అని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజు భూపాల్‌గౌడ్ అన్నారు. చిలుకూరు బాలాజీ ఆలయానికి వచ్చిన ఆయన స్వామివారిని దర్శించుకొని ప్రధానార్చకుడు రంగరాజన్‌ను సన్మానించారు. జీవితంలో ఎంత ఎదిగినా మనకు మార్గనిర్దేశం చేసిన గురువులను మర్చిపోవద్దని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే రత్నం, అంజన్‌కుమార్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, షాబాద్ కిషన్ తదితరులు ఉన్నారు.


ఆలయ అర్చకుడు రంగరాజన్‌ను సన్మానిస్తున్న భూపాల్‌గౌడ్

వివాదాస్పద భూముల్లో యథేచ్ఛగా నిర్మాణాలు

కూల్చివేతకు హైకోర్టు ఆదేశం

- అయినా అధికారుల జాప్యం
- ఒకే భూమికి పలువురు యజమానులు

రామచంద్రాపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండలం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులోని వివాదాస్పద భూముల్లో అక్రమ నిర్మాణాలు అడ్డూఅదుపూ లేకుండా కొనసాగుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లో హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా, వాటిని మున్సిపల్ అధికారులు బుట్టదాఖలు చేశారు. సర్వే నంబరు 204లో నిర్మిస్తున్న ఓ నిర్మాణాన్ని కూల్చివేయాలని ఆదేశించినా, అధికారులు నేటికీ పట్టించుకోవడం లేదు. నిర్మాణదారుడు యథేచ్ఛగా తన పనిని కొనసాగించడం స్థానికంగా పెద్ద చర్చకు దారితీసింది.

దశాబ్దాల వివాదం

కొల్లూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు 1985లో రైతుల నుంచి 204 సర్వే నంబర్‌లోని 21 ఎకరాల భూమిని జీపీఏ ద్వారా కొనుగోలు చేశారు. వారు అక్కడ లేఅవుట్ వేసి ప్లాట్లను విక్రయించారు. అయితే, ఈ ప్లాట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాలేదు. ప్లాట్లు కొన్నవారు వాటిని తమ స్వాధీనంలోకి తీసుకోలేదు. ఇదే అదునుగా, రైతులు తిరిగి రెవెన్యూ అధికారుల నుంచి తమ పేర్లతో పట్టాదారు పాస్‌బుక్‌లు పొందారు. ఆ తర్వాత, 1987 ఈ భూమిని మళ్లీ వ్యవసాయ భూమిగా ఇతరులకు విక్రయించారు. దీంతో ఒకే భూమికి పలువురు యజమానులు అయ్యి, వివాదాస్పద భూమిగా మారింది. ఈ విషయంపై కోర్టుల్లో వాదనలు కొనసాగుతున్నాయి.

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు

ఇక్కడి ప్లాట్లు, వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన పలువురు తమ యాజమాన్య హక్కుల కోసం కోర్టులను ఆశ్రయించారు. రాజేష్ జైన్ అనే వ్యక్తి ఫిర్యాదుతో, వివాదాస్పద భూమిలోని అక్రమ నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినా, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా, నిర్మాణాన్ని కూల్చకుండా జాప్యం చేస్తున్నారు. కుంటిసాకులు చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు రాజకీయ నాయకుల అండదండలు దీని వెనుక ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. వివాదాస్పద భూములు ఎవరివి అనేది కోర్టు మాత్రమే తేల్చాలి. అలాంటిది, కోర్టు తీర్పు రాకుండానే నిర్మాణాలు చేపట్టి సమస్యను మరింత జటిలం చేయడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.


సర్వే నంబరు 204లోని అక్రమ నిర్మాణ జీపీఏ చిత్రం

ఎక్స్‌కవేటర్ లోపలికి వెళ్లలేదు

సర్వే నంబరు 204లోని వివాదాస్పద భూమిలోని నిర్మాణాన్ని కూల్చడానికి సిబ్బందితో వెళ్లాం. కానీ రోడ్డు పక్కన ఉన్న వరద కాలువ అడ్డుగా ఉండటంతో ఎక్స్‌కవేటర్ లోపలికి వెళ్లలేకపోయింది. కూలీలతో కూల్చడానికి కూడా సాధ్యం కాలేదు. త్వరలోనే నిర్మాణాన్ని కూలుస్తాం.

- మహేష్, టీపీవో


మేడ్చల్ టౌన్: సాయిబాబా ఆలయంలో హారతిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్: సాయిబాబా ఆలయంలో ఎంపీ ఈటల రాజేందర్ పూజలు




నవాబుపేట: దత్తాత్రేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య


కీసర: నాగారం మున్సిపాలిటీ గోధుమకుంటలోని ఓమౌజ ఆశ్రమంలో అన్నదానం

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

గురుపౌర్ణమిని పురస్కరించుకొని గురువారం వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్చనలు, అభిషేకాలు, భజనలు, కీర్తనలు, గురు పూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పలు ఆలయాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.


వికారాబాద్: ద్యాచారం ఆలయంలో పూజలందుకుంటున్న సాయిబాబా


వికారాబాద్: రామ మందిరంలో కృష్ణ పంతులుకు బీజేపీ నాయకుల సన్మానం


పరిగి: బసిరెడ్డిపల్లిలో శ్రీకృష్ణగిరి క్షేత్రంలో కృష్ణనందస్వామికి పాదపూజ చేస్తున్న భక్తులు


కులకచర్ల: పాంబండ ఆలయంలో రుద్రహోమంలో భక్తులు


కీసర రూరల్: నాగారంలో శ్రీరమాసత్యనారాయణ స్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు


మర్పల్లి: ఆలయ ఆవరణలో మహిళల కోలాటం


ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్ శ్రీ సాయినిలయంలో హారతి ఇస్తున్న వేదపండితుడు, ఆలయ ధర్మకర్తలు



బొంరాస్‌పేట్: ఎంఈవో, ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు

వైభవంగా పాంబండ గిరి ప్రదక్షిణ


పాంబండ గిరి ప్రదక్షిణలో భక్తులు

కులకచర్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురు పౌర్ణమి సందర్భంగా బండవెల్కిచర్ల పాంబండ గిరి ప్రదక్షిణలో గురువారం సాయంత్రం వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ కోట్ల షైపాల్‌రెడ్డి ముఖ ద్వారం ముందు ధ్వజారోహణం చేసి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. ఈవో బాల నర్సయ్య వచ్చిన భక్తులకు దగ్గరుండి పర్యవేక్షణ చేపట్టారు. అర్చకులు దశరథం, పాండు శర్మ, అనంతమయ్య, అమరేందర్‌లు శ్రీ రామలింగేశ్వరస్వామి దర్శనం కల్పించారు. భక్తులకు పాలమూరు జ్యోతి మాధవరెడ్డి అల్పాహారం సమకూర్చారు. ఈ కార్యక్రమంలో టీచర్ నర్సింహారెడ్డి, నాయకులు వెంకటయ్యగౌడ్, సౌమ్య వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

తాండూరు రూరల్, జూలై 10, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన తాండూరు మండలం చెనిగేష్‌పూర్ గ్రామాన్ని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ గురువారం పరిశీలించారు. గ్రామానికి పైలెట్ ప్రాజెక్టు కింద 140 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 48 ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా కొనసాగుతున్నట్లు తెలిపారు. అనంతరం ప్లానిటేషన్ పనులను పరిశీలించారు.

గురువును మించిన సంపత్తి లేదు

వికారాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి నిర్మాణానికి గురువును మించిన సాధన సంపత్తి లేదని సీనియర్ అడ్వికేట్ గోపాల్ రెడ్డి తెలిపారు. స్థానిక సత్యసాయి జ్ఞాన కేంద్రంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా వేడుకలు నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. వ్యక్తులకు సేవా భావం, సమైక్యతా వాదం, సమయ పాలన చాలా ముఖ్యమని, ప్రస్తుత కాలంలో నాగరిక మానవులు అనాగరికులుగా జీవించుచున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయ కర్త బందప్ప గౌడ్, రాజశేఖర్, సత్యనారాయణగౌడ్, మనోహర్, కపిల్ దేవ్, బసవేశ్వర్, వేణుగోపాల్, విఠోబా, కొండ మల్లయ్య, సతీష్ చంద్ర పాల్గొన్నారు.

కల్తీకల్లు ఘటనకు కారకులను శిక్షించాలి

శామీర్‌పేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కల్తీ కల్లుకు బలైన అమాయకుల పట్ల కారకులపై ప్రభుత్వం కఠిన చర్యలను తీసుకోవాలని తెలంగాణ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ రామ్మోహన్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం శామీర్‌పేటలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కల్తీ కల్లును పూర్తిగా నిషేధించాలన్నారు. కల్తీ కల్లు తాగి మృతి చెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.50లక్షల నష్టపరిహారాన్ని చెల్లించాలని, వారికి ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత


చెట్టుపల్లి తండాలో నిలిచిన పనులు

దుద్యాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పేదలకు మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరతతో ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని వివిధ గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రొసీడింగ్స్ అందజేశారు. దీంతో లబ్ధిదారులు పిల్లర్లు వేసేందుకు పునాదులు తీశారు. ఇసుక అందుబాటులో లేకపోవడంతో నిర్మాణ పనులు ఆదిలోనే నిలిచిపోయాయి. దీనికి తోడు కంకర కూడా దొరకడం లేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్టీలు, సిమెంట్ ధరలు పెరగడంతో ఇళ్ల నిర్మాణానికి ఖర్చు ఎక్కువ అవుతుందని వాపోతున్నారు. స్టీలు, సిమెంట్ తక్కువ ధరకు ఇప్పించడంతో పాటు ఇసుక, కంకర అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

'దగా'ఖానాలు!

(ఐదో పేజీ తరువాయి)

మహిళలకు శస్త్ర చికిత్స చేసి దోచుకుంటున్నారు. ప్రాక్టీస్ సర్టిఫికెట్లు లేని ఆర్‌ఎంపీల క్లినిక్‌లను సైతం వైద్యాధికారులు పట్టించుకోవడం లేదు. పలు చోట్ల ఆర్‌ఎంపీల క్లినిక్‌లు నర్సింగ్ హోంలను తలపిస్తున్నాయి. పరిగిలో రాఘవేంద్ర, హనుమాన్, గ్లోబల్, యాసిన్, పల్లవి తదితర క్లినిక్‌లకు అనుమతులు లేవని గతంలో మెడికల్ కౌన్సిల్ తేల్చింది. పలు క్లినిక్‌లలో అశాస్త్రీయంగా యాంటిబయోటిక్స్, స్టెరాయిడ్స్ వాడుతున్నట్లు గుర్తించారు. ఎంబీబీఎస్ డాక్టర్‌గా చెలామని అవుతున్న నకిలీ వైద్యుడు రాజు గ్లోబల్ క్లినిక్ నిర్వహిస్తుండడంతో ఆ క్లినిక్‌ను సీజ్ చేశారు. ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తిరిగి వారు క్లినిక్‌ను తెరచి నడిపిస్తున్నారు.

తప్పని కడుపు'కోత'లు

గర్భిణులకు నార్మల్ డెలివరీకి అవకాశం ఉన్నా సిజేరియన్లు చేస్తున్నారు. నార్మల్ డెలివరీకి రూ.50 వేలు, సిజేరియన్ అయితే రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. గర్భసంచి తీసేసే శస్త్రచికిత్సలకు ఒక్కో మహిళ నుంచి రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తుండగా, మందులు, పరీక్షల పేరుతో అదనంగా దోచుకుంటున్నారు. పరిగి నుంచి కొడంగల్ వెళ్లే దారిలో ఓ అస్పత్రి, హైదరాబాద్ రూట్‌లో ఉన్న మరో ఆస్పత్రి దోపిడీలో ఆరితేరాయి. ఎవరైనా ఇదేంటని ప్రశ్నిస్తే మరీ దబాయిస్తున్నారు. ఇక పరిగిలోని విజేత ఆస్పత్రిపై గతంలోనూ అనేక ఆరోపణలు ఉన్నాయి. కొందరికి వైద్యం వికటించి మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. ఏటా ఒకరిద్దరు మృతి చెందుతున్నారు. ఇటీవల ఓ యువ జంట పిల్లల కోసం వస్తే వారికి చేసిన శస్త్ర చికిత్స ఫెయిల్ అయి పిల్లలు పుట్టే అవకాశమే లేకుండా పోయిందని ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ ఆస్పత్రిపై వైద్యాధికారులు నామమాత్రంగా తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్‌లు చేస్తుంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రశ్నించిన రోగుల బంధువులపై చేయి చేసుకున్నారని పట్టణ ప్రజలు చెబుతున్నారు.

ఇళ్ల నిర్మాణాలు ఆపాలి

బషీరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు కేటాయించిన భూమిలో ఇళ్లనిర్మాణాలను వెంటనే ఆపాలని మైల్వార్ గ్రామ మైనార్టీలు పలువురు బషీరాబాద్ తహసీల్దార్ షాహిదాబేగంను కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 235లో 4.35 ఎకరాల భూమి ఏళ్ల తరబడి మైనార్టీలకు చెందినదిగా ఉందన్నారు. ఈ భూమిని స్మశానవాటికగా వాడుతున్నామని, ఇక్కడా ఇందిరమ్మ ఇళ్లు చేపడుతున్నారని వారన్నారు. మాజీ మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు అబ్దుల్‌రజాక్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను కలిసి ఆ భూమిలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

'ఆలయ భూమిలో ఇంటి నిర్మాణానికి అనుమతి కోరలేదు'

కులకచర్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ ఆలయానికి ఇచ్చిన భూమిలో తాను ఇంటి నిర్మాణానికి అనుమతి కోరలేదని, తన సొంతభూమిలో నిర్మాణానికి కార్యదర్శిని అనుమతి కోరానని మండలంలోని పీరంపల్లి మాజీ సర్పంచ్ సత్యనారాయణయాదవ్ స్పష్టం చేశారు. 'హనుమాన్ ఆలయ ఆవరణలో ఇళ్ల నిర్మాణం వద్దు' అనే వార్తపై స్పందించి గురువారం కులకచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ సొంత భూమి సర్వే నెం.140లో 18 గుంటలు భూమి ఉండగా అందులో 4గుంటలు భూమి ఆలయానికి ఇచ్చామన్నారు. మిగతా 14తమకే ఉందని, దీనిపై గ్రామస్థులు కొందరు రాద్ధాంతం చేస్తున్నారన్నారు.

కాంగ్రెస్ నూతన కమిటీ

కులకచర్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాంపూర్ గ్రామంలో గురువారం డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డితో కలిసి నూతన గ్రామకమిటీని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు ఎంపిక చేశారు. గ్రామ కమిటీ నూతన అధ్యక్షుడిగా సత్తయ్య, గౌరవ అధ్యక్షుడిగా కృష్ణ, ఉపాధ్యక్షులుగా తిరుపతయ్య, ప్రధానకార్యదర్శిగా రవి, యువజన విభాగం అధ్యక్షుడిగా నర్సింహులు ఎంపికయ్యారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలతో గ్రామ కమిటీల ఎంపిక చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా కళాశాల నిర్వహణ



టీహెచ్ జూనియర్ కళాశాల

తాండూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం పోలీస్‌స్టేషన్ పక్కనే టీహెచ్ కళాశాలను ఏర్పాటు చేసి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారు. ఇదే కళాశాలలో గతేడాది 80మంది విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు ప్రక్రియలో అసలుకథ బయటపడింది. అప్పట్లో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బస్టాండ్ సమీపంలో ఉన్న చైతన్య జూనియర్ కళాశాలలో అడ్మిషన్ పొందినట్లు చూపిస్తూ ఆ కళాశాల నుంచి పరీక్ష రాయించి సర్దుబాటు చేశారు. ప్రస్తుతం రెండవ ఏడాది ప్రారంభమైనా ఇట్టి కళాశాలకు ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ఎలాంటి అనుమతులు రాలేదు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఎలాంటి అనుమతులు లేవు



టీహెచ్ కళాశాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. కళాశాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ కూడా జరగలేదు. గతేడాది అనుమతులు లేకుండా కొనసాగినట్లు మా దృష్టికి వచ్చింది. ఈ ఏడాది కూడా అనుమతులు ఇవ్వలేదు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

- ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి

సంక్షిప్తంగా..

ఉపాధ్యాయులకు సన్మానం

కులకచర్ల/చౌడాపూర్:గురుపౌర్ణమి సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల పరందాములు, మాంతయ్య దాస్, రసమచంద్రయ్యలను బీజేపీ రాష్ట్ర నాయకుడు కరణం ప్రహ్లాద్‌రావు సన్మానించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కాటన్‌పల్లి అంజిలయ్య పాల్గొన్నారు. చౌడాపూర్ మండల కేంద్రంలో రిటైర్డ్ హెచ్ఎంను స్థానిక నాయకులు శాలువాతో సన్మానించారు.

విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ

దోమ: పెద్దతండా, బుద్లాపూర్ ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో వెంకట్ గురువారం సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం, మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, యూనిఫాంలు విద్యార్థులకు అందేవిధంగా హెచ్‌ఎంలు చొరవ చూపాలని సూచించారు. విద్యార్థులకు ఐడీకార్డులు పంపిణీ చేశారు.

ఆర్థిక సాయం

బొంరాస్‌పేట్/ యాలాల: బొంరాస్‌పేట్‌లోని తుంకిమెట్లకు చెందిన శ్రీనివాస్‌గౌడ్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబానికి 1997-1998 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి స్నేహితులు గురువారం రూ.5,100 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతయ్య, సుదర్శన్‌గౌడ్, అశోక్ గౌడ్ పాల్గొన్నారు. అదే విధంగా యాలాల మండలంలోని అన్నసాగర్ గ్రామంలో మాల సుగుణమ్మ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి బీవీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్ అన్నసాగర్ రూ.3వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలి

బంట్వారం: ట్రాఫిక్ నియమాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని బంట్వారం ఎస్‌ఐ విమల అన్నారు. మండల కేంద్రంలోని బంట్వారం ప్రధాన రహదారిపై, మోడల్ స్కూల్‌లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ బ్యులా పాల్గొన్నారు.

సిరిసిల్ల విలేకరి మృతి బాధాకరం

కొడంగల్: గుండెపోటుతో సిరిసిల్లలో ఓటీవీ ఛానల్ విలేకరి మృతి బాధాకరమని సీపీఐ నియోజకవర్గ నాయకుడు జీ.సురేశ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు.

ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

చౌడాపూర్: ప్రతీ రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారిణి భావన అన్నారు. మరికల్ రైతువేదికలో గురువారం రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకున్నారు.

తపస్ సభ్యత్వ నమోదు

మోమిన్‌పేట్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో మోమిన్‌పేట్ మండల అధ్యక్షుడు మధుకర్ ఉపాధ్యాయులతో సభ్యత్వాలు నమోదు చేయించారు.

పెద్దేముల్: పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆనందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ అభియాన్‌లో భాగంగా గురువారం పెద్దేముల్ మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేశారు.

దాతల ఉదారత అభినందనీయం

పరిగి: ప్రభుత్వ పాఠశాలకు దాతల ఉదారత అభినందనీయని పరిగి ఎంఈవో గోపాల్ అన్నారు. మిట్టకోడూరు ప్రాథమిక పాఠశాలలో గ్రామస్తులు ఇచ్చిన విరాళాలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఉస్మాన్‌అలీ, మాజీ సర్పంచ్ జగదీశ్వర్, పి.మాణిక్యం పాల్గొన్నారు.

బూత్‌స్థాయి అధికారులకు అవగాహన

పూడూరు: మండలకేంద్రంలో గురువారం జాతీయ స్థాయి శిక్షణ, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బూత్ లెవల్ అధికారులకు, పర్యవేక్షకులకు ఈసీఐ(ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా), ఇండియా ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ జాతీయ స్థాయి శిక్షణ ఇవ్వడంతోపాటు సామర్థ్య నిర్మాణం గురించి వివరించారు.

సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు

దుద్యాల: చెట్టుపల్లి తండాలో గురువారం కొడంగల్ సబ్ యూనిట్ అధికారి పకీరప్ప బొంరాస్‌పేట్ పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో కలిసి తండాలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

ఎంజేపీలో అతిథి ఉపాధ్యాయులకు దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: హైదరాబాద్-ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని బీసీ గురుకుల పాఠశాల/కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిలో అతిథి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, పరిగి ప్రిన్సిపాల్ నవనీతలు తెలిపారు.

14, 15న కేవీపీఎస్ జిల్లా సామాజిక శిక్షణ తరగతులు

తాండూరు: వికారాబాద్‌లో ఈనెల 14, 15వ తేదీల్లో కేవీపీఎస్ జిల్లాస్థాయి సామాజిక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు పాల్గొంటారని తెలిపారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి మజీద్‌పూర్ బస్టాప్‌లో గుర్తుతెలియని వృద్ధుడు(70) మృతిచెందాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. పరిసరాల్లో భిక్షాటన చేసేవాడని స్థానికులు తెలిపారు. అనారోగ్యంతోనే వృద్ధుడు మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి సంబంధీకులు 9490617142, 9490617231 నంబర్లను సంప్రదించాలని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

కీసర, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపాలిటీ రాంపల్లి దాయరలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను గురువారం కూల్చివేశారు. రాంపల్లి దాయరలోని సర్వే నంబర్ 558లో మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 ఫీట్ల రోడ్డులో అక్రమంగా షెడ్డు నిర్మిస్తున్నారని ఇటీవల గ్రామస్థులు, రైతులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నాగారం మున్సిపల్ అధికారులు అక్రమంగా నిర్మించిన షెడ్డును కూల్చివేశారు. నియమ, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని లేదంటే చర్యలు తీసుకుంటామని కమిషనర్‌ను హెచ్చరించారు.

అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యం


సందీప్‌కుమార్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

కులకచర్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బండవెల్కిచర్ల గిరిజన గురుకుల కళాశాలలో అదృశ్యమైన విద్యార్థి సందీప్‌కుమార్ ఆచూకీ లభించింది. ఏపీలోని తిరుపతి జిల్లా రేణిగుంట రైల్వేస్టేషన్ పోలీసులు పట్టుకొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కళాశాలలో ఫస్టియర్ ఎంపీసీ చదువుతున్న విద్యార్థి సందీప్‌కుమార్ మంగళవారం ఉదయం కళాశాల గేటు దూకి అదృశ్యమైన విషయం విదితమే. ఇక్కడి నుంచి పాలమూర్‌కు వెళ్లి అక్కడి నుంచి అదే రాత్రి రైలులో రేణిగుంట వెళ్లాడు. బుధవారం సాయంత్రం అక్కడి నుంచి ఇతరుల ఫోన్ ద్వారా తల్లికి ఫోన్ చేశాడు. తన దగ్గర డబ్బులు లేవని ఈ నంబర్‌కు పంపించాలని కోరాడు. వెంటనే అప్రమత్తమైన తల్లి ఆఫోన్ సంబంధిత వ్యక్తితో మాట్లాడి తమ అబ్బాయి పారిపోయి వచ్చాడని తెలిపింది. దగ్గర్లో ఉన్న పోలీసులకు అప్పగించాలని కోరింది. దీంతో సదరు వ్యక్తి విద్యార్థి సందీప్‌కుమార్‌ను రైల్వేస్టేషన్ పోలీసులకు అప్పగించి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం తల్లిదండ్రులు అక్కడికి వెళ్లగా పోలీసులు సందీప్‌కుమార్‌ను అప్పగించగా ఇంటికి తీసుకువచ్చారు.

రేపు నల్సార్‌లో 22వ స్నాతకోత్సవం

శామీర్‌పేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలోని నల్సార్ విశ్వవిద్యాలయంలో ఈ శనివారం(రేపు) ఉదయం 10.30 గంటలకు 22వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వాసంతి తెలిపారు. గురువారం ఆమె మీడియాకు వెల్లడించారు. ముఖ్యఅతిథిలుగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, అతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు విచ్చేస్తున్నట్లు ఆమె తెలిపారు. నల్సార్ చాన్స్‌లర్, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజాయ్ పాల్ అధ్యక్షతన, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు ఆధ్వర్యంలో స్నాతకోత్సవం నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ చెప్పారు. విద్యార్థులకు పట్టాలను, ఉత్తమ ప్రతిభావంతులకు మెడల్స్‌ను ప్రధానం చేయనున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

దౌల్తాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వం రెండు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు బోడివెంకట్‌రెడ్డి, జంగం వీరన్న, దస్తప్ప అన్నారు. భవన నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. రెండు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, ఆశప్ప, మల్కయ్యగౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసుడు దేశానికి స్ఫూర్తి ప్రదాత

వికారాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి జ్ఞాన భిక్ష పెట్టిన వ్యాసుడు దేశానికి స్ఫూర్తి ప్రదాత అని సత్యసాయిజ్ఞాన కేంద్రం నిర్వాహకుడు బందెప్పగౌడ్ అన్నారు. పద్యపద భారతి ఆధ్వర్యంలో గురువారం వ్యాస పౌర్ణమి సందర్భంగా గురుపూజోత్సం స్థానిక ఎంజీజీ కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి డా మున్నూర్ రాజు, సుధాకర్ గౌడ్, ఎన్నారం శ్రీనివాస్, రెడ్యా రాథోడ్, దివాకర్ శాస్త్రీ, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ఘట్‌కేసర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో విలీనమైన గ్రామ పంచాయితీల కార్మికులకు మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, సబిత, లక్ష్మి, పద్మ, జయమ్మ, కవిత పాల్గొన్నారు.

ధారూరులో ఇందిరా మహిళాశక్తి సంబురాలు

ధారూరు, జూలై10 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళశక్తి సంబురాలు ధారూరులో స్త్రీశక్తి భవన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మహిళలకు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలను అధికారులు వివరించారు. ఆర్థికంగా అభివృద్ధి సాధించిన ధారూరుకు చెందిన ఖాజాబీ, లక్ష్మిలను మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు బాలేశ్వరీ, వీవోఏల సంఘం మండలాధ్యక్షురాలు సుజాత శాలువాలు కప్పి సన్మానించారు. తహసీల్దార్ సాజిదా బేగంను మహిళా సమాఖ్య సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో డీపీఎం కొమురయ్య, తహసీల్దార్ సాజిదాబేగం, ఎంపీడీవో నర్సింహులు, ఐకేపీ ఏపీఎం అంజిలయ్య, సీసీలు పండరి, యాదయ్య, అశోక్, నాగరాణి, వెంకటయ్య, సిద్దూ, సత్యయ్య పాల్గొన్నారు.

దేశ రక్షణ నిధికి ఆర్బీవోఎల్ విరాళం

తాండూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ నిధికి యాలాల మండలం జక్కేపల్లి పరిధిలో ఉన్న రాడికల్ బయోఆర్గానిక్స్ లిమిటేడ్ (ఆర్బీవోఎల్) మరోసారి విరాళం అందించింది. పెహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విజ్ఞప్తి మేరకు ఆర్బీవోఎల్ సంస్థ తరుపున సీఈవో శ్రీనివాస్‌రెడ్డి జాతీయ రక్షణ నిధికి రూ.2లక్షలు విరాళం అందిస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం

వికారాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కొత్రేపల్లి రెవెన్యూ శివారులోని సర్వేనెంబర్ 164లో ఉన్న ప్రభుత్వ భూమి అక్రమణకు గురైనట్లు సమాచారం రావడంతో తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు గురువారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన శంకరి యాదగిరి తో పాటు ఇతరులు ఈ భూమిని అన్యాయంగా స్వాధీనం చేసుకున్నట్లు గుర్తించడంతో అధికారులు భూమిని స్వాధీనం చేసుకున్నారు. అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా తేల్చేశారు.